సామ్రాజ్యం తిరిగిరాదు



సామ్రాజ్యం చీకట్లో కలిసిపోయి నిల్చుంది. ఆమె పక్కనే వున్న చిటికేశ్వరపు చెట్టు పొట్టి రాక్షసిలా నిలబడి గాలికి చిన్నగా వూగుతోంది.

చేతిలో వున్న సూట్కేసును చెట్టు వారగా వుంచి ఒక్కసారి బరువుగా నిట్టూరుస్తూ దూరంగా కనపడుతున్న వూరికేసి చూసింది. పైర్లు కోసెయ్యడంవల్ల అడ్డులేక వూళ్ళో ఇళ్లన్నీ శిలులుగా మారిపడివున్న మనుషుల్లా కనిపించాయి. అక్కడా అక్కడా ఇళ్ళలో నుంచి బయటకు కనబడుతున్న నూనె దీపాలు బాగా తాగినవాడి కళ్లలా ఎర్రగా వున్నాయి.

టైమెంతయిదోననుకుంది సామ్రాజ్యం. తను బయల్దేరినప్పుడు ఏడు గంటలు

కావస్తోందని చెప్పాడు రేడియోలో. తను మైలున్నర నడిచి స్టేషనుకు వచ్చింది. ఎనిమిది గంటలకు రైలు వస్తుందని తనకు తెలుసు. రైలు రావడానికి ఐదు నిముషాల ముందే గంట కొడతారు. ఇంకా గంట కొట్టలేదు. అంటే రైలు రావటానికి ఇంకా టైమున్నది.

ఒక్కసారి తలతిప్పి ఆ చిన్న స్టేషన్‌కేసి చూసింది. ఎవరో విమానంలో వెళుతూ కిందకు జార్చిన ఏదో వస్తువులా అనిపించింది. లోపల స్టేషన్ మాస్టరు గదిలో వెలుగుతున్న దీపం ఎవరికో భయపడుతున్నట్లుగా అటూ ఇటూ కదులుతోంది. కర్ఫ్యూ విధించినట్టుగా ప్రశాంతంగా వుంది. ఊళ్ళోని సందడి అప్పుడప్పుడు వినిపిస్తోంది.

"నేనొక్కదాన్నేనా" అనుకుంది సామ్రాజ్యం. సాధారణంగా ఆ స్టేషన్లో రాత్రిపూట రైలుకి ఒకరిద్దరు ప్రయాణీకులకంటే వుండరు.

ఎవరయినా వస్తున్నారేమోనని తను నడిచివచ్చిన దారికేసి కళ్ళు చిట్లించి చూసింది సామ్రాజ్యం.

ఎవరో గబగబా నడిచి వస్తున్నట్టుగా అనిపించి కనులను మరింత చిట్లించి చూసింది. నిజమే... ఎవరో వస్తున్నారు. దూరం నించి ఆడో, మగో తెలీలేదు.

"విశ్వనాథం కాదుగదా" అనుకుంది.

అతనే ఐతే బావుండు... అసలు సాయంత్రానికే వస్తానని చెప్పాడు పూర్ణించి... అందుకే తను మధ్యాహ్నం రైలుకి వెళ్ళకుండా అతనికోసం ఎదురుచూసింది. కానీ రాలేదు. ఏదో పనుండి వుండిపోయాడనుకుని తప్పనిసరయి బయల్దేరింది. బహుశ ఇంతకుముందే పక్కవూరి వరకు బస్సులో వచ్చి అక్కడినుండి ఏ బండిలోనో వచ్చి వుంటాడు. రాగానే తను ఈ రైలుకి వెడుతున్నట్టు తెలిసిందేమో...

సామ్రాజ్యం ఇలా ఆలోచిస్తూండగానే ఆ వస్తున్న మనిషి స్త్రీ అని తెలిసిపోయింది.

ఆమె చేతిలో పెద్ద సూట్కేసు వుంది. ఆ సూట్కేసు ఆమె చేతిలో లేకుండా వుంటే ఇంకా వేగంగా నడిచేదేమో అనుకుంది సామ్రాజ్యం.

ఆమె ఎవరో సామ్రాజ్యం గుర్తించలేక పోయింది. గబగబా రైలుపట్టాలు దాటివచ్చి స్టేషన్ ముందు చిటికేశ్వరపు చెట్టుకు అవతలగా సామ్రాజ్యానికి కొంచెం దూరంలో నిలబడింది– సూట్కేసును కిందవుంచి.

"ఎవరీమె" అనుకుంది సామ్రాజ్యం. పలకరించుదామా అనుకుని ఎందువల్లనో ఆ ప్రయత్నాన్ని మానుకుంది.

ఆమె పమిట కొంగుతో మొహానికి, చేతులకు పట్టిన చెమటను తుడుచుకుని ఒకసారి రైలువచ్చేదిశగా చూసి, స్టేషను మాష్టరు గదిలోకి వెళ్ళింది.

ఆమె మాటలు సామ్రాజ్యానికి సరిగా వినిపించలేదు. కాని- స్టేషను మాస్టరు గొంతు స్పష్టంగానే వినిపించింది.

"ముప్పావు గంట లేటు తల్లీ"

భారంగా అడుగులు వేస్తూ బయటకు వచ్చిందామె. వచ్చి సూట్కేసు పక్కనే నిలబడింది.

సామ్రాజ్యం ఆమెనే చూస్తున్నది. ఆమె మొహం చీకట్లో సరిగా కనిపించడం లేదు. ఎవరై వుంటుందనుకున్నది. ఎవరయినా ఇలా చీకట్లో అంతపెద్దసూట్కేసుతో ఒంటరిగా వస్తుందా??

ఒకవేళ ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా వస్తున్నదేమో... ఏమో... ఐ వుండ వచ్చు... ఇంతకీ పెళ్ళయిందా? వెళ్ళి మాట్లాడిస్తే?? తెలిసిపోతుంది...

ఆమె భయపడుతుందేమో తన ప్రయాణం తెలిసిపోయిందని...

చలిగాలి రివ్వున ఒక్కసారి గట్టిగా వీచింది. వెన్నులోంచి సామ్రాజ్యానికి వణుకు పుట్టింది. పమిటను చెవుల మీదుగా లాక్కుని వంటి చుట్టూ తిప్పుకుంది.

చిటికేశ్వరపు చెట్టు అటూ, ఇటూ గట్టిగా వూగింది ఎవరో కుదిపినట్టు.

సామ్రాజ్యానికి కాళ్ళు నొప్పులు పుట్టాయి. సూట్కేసును వాల్చి, దాని మీద కూర్చుందామనుకుంది.

ఇంతలోనే స్టేషన్ ముందు నిల్చున్న ఆమె చిన్నగా ఏదో మాట్లాడటం వినిపించింది- ఆమెకేసి చూసింది.

ఆమె స్టేషన్‌కు వచ్చే దారివైపు చూస్తోంది.

ఎవరో సిగరెట్టు కాలుస్తూ వేగంగా వస్తున్నారు...

ఆ మనిషి కొంచెం దూరంలోకి వచ్చిన తర్వాత ఆ నడక చూసి అతనెవరో సులభంగానే గుర్తు పట్టింది సామ్రాజ్యం...

అతను విశ్వనాథం-

'ఐతే తను స్టేషన్‌కు వచ్చినట్టు తెలుసు కున్నాడన్నమాట' అనుకుంది సంతోషంగా...

అతనితో చెప్పకుండా వెళ్ళిపోతున్నదనీ, పనయిపోగానే వెంటనే వూరికి తిరిగి వచ్చెయ్యాలనీ అనుకుంది. ఇప్పుడు యింకో రెండ్రోజులు అక్కడే వున్నా ఫర్వాలేదు. కాని యింకో రెండు రోజులు- మొత్తం వారం తను అక్కడ వుండటానికి విశ్వనాథం వొప్పుకుంటాడా?

ఒక్కరోజు కూడా తన ఇంటికి రాకుండా తనని చూడకుండా వుండలేని విశ్వనాథం తన వారం రోజుల ఎడబాటుని ఎంతమాత్రం సహించలేడు.

తను మాత్రం సహించగలదా? తన బ్రతుకు మీద తనకి జాలి. అసహ్యమూ వుండొచ్చు... తను తప్పుడు మార్గంలోనే నడుస్తూ వుండొచ్చు. కాని విశ్వనాథంని వదిలి తను ఎందువల్లనో దూరంగా వెళ్ళలేక పోతోంది.

ఎందువల్ల?

చాలా వరకు కృతజ్ఞతే... ఇంకా వుంటే ప్రేమ. అదీ ఎక్కువగా కృతజ్ఞత వల్ల, అతను తనని ప్రేమించటం వల్ల ఏర్పడిన ప్రేమ.

నిజానికి అతను తనని ఎలాంటి స్థితి నించి బయటకు లాగి ఓ దారి చూపించాడు?

కట్టుకున్న మొగుడికి తన అవసరం ఎప్పుడోగానీ లేకపోయింది. ఇక మిగిలింది తనకు ప్రతి రాత్రి నరకమే.

ఆ నరకాన్ని భరించేశక్తిని కోల్పోయి ఆ కొలిమిలో నించి బయటపడివచ్చి చావడం ఇష్టంలేక ఎటుపోవాలో తెలీక దిక్కుతోచక తిరుగుతున్నప్పుడు కనిపించాడు విశ్వనాథం... తన పరిస్థితి అతనితో ఏ మాత్రం సంకోచించకుండా చెప్పుకుంది. అతను తనని చులకనగా చూడలేదు. ఒకప్పుడు అతను తను పక్కింట్లో వున్నప్పుడు తనని ప్రేమించాడు. ప్రేమలేఖలు రాశాడు. అవి ఇంట్లో చిక్కి, తాము ఆ యిల్లు వదిలి పోవడానికి కారణమయ్యాయి. నిజానికి అప్పట్లో తనకీ విశ్వనాథం మీద ప్రేమలేదు- ఎందువల్లనో, ఆ విషయం అతనికి తెలుసునో? తెలీదో? ఆనాటి విషయాలను మనసులో వుంచుకోకుండా తనని తనతో ఆ వూరికి తీసుకెళ్లాడు. తనచేత ప్రయివేటు బడి పెట్టించి పిల్లలను చేర్చి తనకో బ్రతుకుతెరువు, జీవితం మీద ఆశను చూపించాడు. ఆ క్షణమే తను విశ్వనాథానికి లొంగి పోయింది.

అప్పటినుంచీ ఈనాటి వరకూ అంతే. తన సర్వస్వమూ అర్పించుకున్నది ఇప్పటివరకూ తన ఆలనా పాలనా విశ్వనాథమే చూసుకుంటున్నాడు...

దగ్గరకు వచ్చేశాడు విశ్వనాథం.... అతనికి కనిపించేలా ముందుకు రాబోయి ఠక్కున ఆగిపోయింది సామ్రాజ్యం.

విశ్వనాథం రావడంతోనే స్టేషన్ ముందు నిలబడివున్న ఆమె దగ్గరకు నడిచి "శ్యామలా" అని పిల్చాడు.

ఉలిక్కి పడింది సామ్రాజ్యం.

ఆమె శ్యామలా? విశ్వనాథం భార్యా... ఎందుకలా వెళ్ళిపోతోంది?

"నువ్విలా తొందరపడతావనుకోలేదు శ్యామలా" అన్నాడు విశ్వనాథం చిన్నగా ఆమెకు దగ్గరగా జరిగి...

ఆమె మాట్లాడలేదు. మౌనంగా వుండిపోయింది.

సామ్రాజ్యం చెట్టు చాటుకు సర్దుకుని నిల్చుంది... వాళ్ళ మాటలు బాగానే వినిపిస్తున్నాయి...

"నాతో పూర్తిగా తెగతెంపులు చేసుకుందామనే యీ ప్రయాణం" విశ్వనాధమే అంటున్నాడు...

ఆమె పెదవి కదపలేదు...

"నీకిది న్యాయంగా వున్నదా శ్యామలా"

"మీరు నాకు అన్యాయం చెయ్యటం మీకు న్యాయంగా వుందా?" కోపంగా అన్నదామె.

"సామ్రాజ్యం గురించేగా నువ్వనేది?"

"అంతకుమించి నాకు నరకం ఏం కావాలి?"

"ప్లీజ్... నన్నర్ధంచేసుకో శ్యామలా"

"మీరనేదేమిటి? నేను ఆమెతో గడుపుతాను... నువ్వు నోరు మూసుకో అంటారు. అంతే కదా?"

విశ్వనాథం మాట్లాడలేదు.

అతని మౌనాన్ని ఆసరాగా తీసుకుని ఆమె మరింత ఆవేశంగా మాట్లాడింది.

"నేనెంత క్షోభను అనుభవిస్తున్నానో అర్థం చేసుకునే ప్రయత్నం ఎందుకు చెయ్యరూ? మీకిది చాలా సహజంగానే వుండొచ్చు. మీరిలా చెయ్యటానికి మీలో మరో స్త్రీకి భాగమివ్వటానికి నాలో లోపమేమీ లేదు. నాలో ఏదయినా లోపముండి మీకు న్యాయం చేకూర్చలేనప్పుడయితే మీరిలా చేస్తుంటే నోరు మూసుకుని పడివుండేదాన్ని. మన పెళ్ళి అయి ఎన్నాళ్ళయింది? ఏడాది దాటింది.. అప్పుడే నేనంటే మీకు ఇష్టం పోయిందా? ఏదో వ్యామోహంలో వున్నారని మొదట్లో మంచిగా చెప్పాను. మీరు నామాటను పట్టించుకోలేదు... ఇప్పుడు మీరు పూర్తిగా నా చెయ్యి దాటి పోయేలా కనిపిస్తున్నారు. ఇక నేను భరించలేను" ఆమె ఆగింది.

సామ్రాజ్యం వూపిరి బిగపట్టి ఆమె మాటలను వింటోంది. మనసంతా అదోలా ఐపోయింది. ఇంతకుముందే తన కారణంగా తనకీ ఆమెకీ మధ్య కొంత ఘర్షణ జరుగుతున్నట్టుగా చెప్పాడు విశ్వనాథం. తను బాధ పడింది. ఐనా విశ్వనాధాన్ని వదల్లేక పోయింది. అది తన బలహీనతే.

ప్లీజ్... నన్ను అర్థం చేసుకోటానికి ప్రయత్నించు శ్యామలా... సామ్రాజ్యం మంచి మనిషి. ఒకప్పుడు నేను ఆమెను ఎంతగానో ప్రేమించాను. పెళ్లికూడా చేసుకోవాలనే అనుకున్నాను. కాని కుదర్లేదు... సామ్రాజ్యాన్ని మొదటిసారిగా ఈ స్థితిలో చూసినప్పుడు

గుండె తరుక్కుపోయింది. ఇక్కడకు తీసుకొచ్చాను... సామ్రాజ్యానికి నాకూ మధ్య శారీరక సంబంధమే ముఖ్యమయినది కాదు... సామ్రాజ్యం దగ్గరకు వెళ్ళొచ్చు. కాని అంత మాత్రాన నీకు అన్యాయం చేస్తానని అనుకోకు... నీ కెలాంటి భయమూ లేదు... వచ్చెయ్... వెళ్ళి పోదాం..."

"మీరు ఎన్నయినా చెప్పండి. మీరు ఆమెతో సంబంధం పూర్తిగా తెంచుకున్న రోజునే నేను ఆ ఇంట మళ్ళీ కాలుపెడతాను... నేనో, ఆమో నిర్ణయించుకోండి... ఒక వరలో రెండు కత్తులు ఇమడవు... నేనిలా అడుగుతున్నానని ఏమీ అనుకోకండి... ఆమే నా పరిస్థితిలో వుంటే మీరిలా చేస్తుంటే ఒప్పుకునేదేనా? మీకు తెలీదనుకోను. తన భర్తను మరో స్త్రీ పంచుకోవడాన్ని ఏ స్త్రీ సహించలేదు. మీరు చేస్తున్న పనే నేను చేస్తే మీరెలా ఫీలవుతారు?"

"శ్యామలా"

సామ్రాజ్యం అదిరి పడింది....

"కోపం తెచ్చుకోగానే సరికాదు. ఎదుటి మనిషిని అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యండి..."

విశ్వనాథం వెంటనే మాట్లాడలేదు.

స్టేషన్లో రైలు రాబోతున్నట్టుగా గంట కొట్టారు...

"ఇంటికి వెడదాం పద" అన్నాడు విశ్వనాథం ఆమె భుజం మీద చెయ్యి వేసి...

"సారీ... నేను రాలేను. మా ఇద్దర్లో మీకు ఎవరో ఒకరే కావాలి... చెప్పండి త్వరగా... రైలు వస్తోంది."

ఊపిరి బిగపట్టి విశ్వనాథం చెప్పబోయే మాటలకోసం ఎదురుచూసింది సామ్రాజ్యం.

అతనికి ఎవరు ముఖ్యం??

భయపడింది... తనే కావాలని చెబుతాడేమోనని తను తన స్వార్థమే చూసుకుంది. మరో ఆడదాని కన్నీటి గురించి తను అంతగా ఆలోచించలేదు... ఐతే విశ్వనాథం తన మీది వ్యామోహంతో వున్నాడు. ఇప్పుడు తనే తనకు కావాలంటే? ఆమె బ్రతుకు??

దూరంగా రైలు వస్తున్న చప్పుడు వినిపిస్తోంది.

సామ్రాజ్యం గుండెలు అదురుతున్నాయి.

"త్వరగా చెప్పండి..."

"నువ్వే గెలిచావు శ్యామలా... పద... వెళ్ళిపోదాం..." అన్నాడు సూట్కేసును అందుకని...

సామ్రాజ్యానికి ఏడుపు రాబోయి ఆగిపోయింది.

వాళ్ళకేసి చూసింది... ఎడమ చేతిని భార్య భుజం మీద వేసి కుడిచేత్తో సూట్కేసు పట్టుకుని పట్టాలు దాటుతున్నాడు విశ్వనాథం.

ఆ దృశ్యం చూస్తుంటే ఒకవైపు సంతోషమూ మరో వైపు దుఃఖమూ కలిగాయి...

కళ్లు తుడుచుకుని ముందుకు నడిచింది సామ్రాజ్యం...

టిక్కెట్టు తీసుకుని వచ్చేసరికి స్టేషన్‌లోకి వచ్చింది రైలు.

ఇద్దరు మనుషులు దిగారు.

ఖాళీగా వున్న ఓ పెట్టెలో ఎక్కి ఓ మూలగా కూర్చుంది సామ్రాజ్యం.

పెద్ద చప్పుడుతో ముందుకు కదిలింది రైలు.

బయటకు చూసింది సామ్రాజ్యం. శిలల్లాంటి ఇళ్లు. ఆ ఇళ్ళవయిపు నడచి వెళుతున్న ఆ ఇద్దరూ అస్పష్టంగా కనిపించారు.

రైలు వేగం అందుకుంటోంది. ఊరు దూరమవుతోంది.

"ఇప్పుడేమిటి దారి?" అనుకుంది సామ్రాజ్యం. ఇప్పుడు సామ్రాజ్యం మనసులో ఇక ఆ వూరికి తిరిగి వచ్చే ఆలోచనే లేదు.

(మే 1981 జ్యోతి మాసపత్రికలో ప్రచురితం)